క్లుప్తంగా

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



విద్యార్థినిలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై అహ్మద్ ఉన్నీషా

భీమవరం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎస్‌ఐ అహ్మద్ ఉన్నీషా అన్నారు. విద్యాలయాల వద్ద ఆకతాయిలు వేధింపులకు గురి చేస్తే వెంటనే డయల్ 112 కి సమాచారం అందిస్తే పది నిమిషాల వ్యవధిలో ×మహిళా రక్షక్ టీమ్స్× వారు మీకు రక్షణ కల్పిస్తారని తెలిపారు. పట్టణంలోని సెంట్ ఆన్స్ విద్యార్థినిలకు సైబర్ క్రైమ్, పోక్సో, మహిళల చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు వారి యొక్క ఆత్మ రక్షణకు పోరాట విద్యను తప్పని సరిగా నేర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా రక్షక్ టీమ్స్ లో గల మహిళా పోలీసు అధికారులు, సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

కుంగుతున్న గోదావరి గట్టు రోడ్డు



ధ్వంసమైన గోదావరి గట్టు రోడ్డు

నరసాపురం: పట్టణంలోని గోదావరి గట్టు రోడ్డు ధ్వంసమవుతుంది. పడవలరేవు నుంచి కొండాలమ్మగుడి వరకూ రోడ్డుకు పలు చోట్ల గోతులుపడ్డాయి. రోడ్డు చాలా చోట్ల కుంగిపోయింది. దీంతో రోడ్డు ప్రమాదకరంగా మారింది. దీంతో మార్నింగ్ వాకింగ్ వచ్చే వాళ్లతో పాటు సాయంత్ర సమయంలో సేదదీరడానికి వచ్చే వారు ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

గవర కులస్తులకు సంక్షేమం అందించేందుకు కృషి

పాలకొల్లు అర్బన్: గవర కులస్తులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందజేయడానికి తన వంతు కృషి చేస్తానని గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర అన్నారు. పాలకొల్లు మండలం గవరపేటలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. గవరపేటలో పలు సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ముఖ్యంగా గవర కులస్తులకు కార్పొరేషన్ ద్వారా కల్యాణ మండపం నిర్మించడానికి స్థానిక మంత్రి రామానాయుడు, సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళతానన్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ మళ్ల వెంకట మురళి ఉన్నారు.

వైభవంగా దాసాంజనేయుని విగ్రహ ప్రతిష్ఠ



గవరపేటలో దాసాంజనేయుని విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని గవరపేటలో బల్లవంతెన వద్ద దాతల విరాళాలతో నిర్మించిన శ్రీ దాసాంజనేయస్వామి, శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ శనివారం వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్ల కల్యాణం గ్రామంలోని 30 మంది దంపతులు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠలో కుంభం పోశారు. అలాగే గో దర్శనం చేశారు. శిఖరం పై నుంచి బూరెలు పోశారు. అర్చక స్వామి బ్రహ్మశ్రీ ర్యాలి శివరామశర్మ తో పాటు వేద పండితుల బ్రహ్మత్వంలో పూజలు నిర్వహించారు. అనంతరం సుమారు 5 వేల మందికి అన్నసమారాధన చేశారు.

నూర్ బాషా సంఘ అధ్యక్షురాలిగా హుస్సేన్ బీబీ



షేక్ హుస్సేన్ బీబీ

పెనుగొండ: నూర్ బాషా ముస్లిం సంక్షేమ సంఘ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా తాడేపల్లి గూడేనికి చెందిన షేక్ హుస్సేన్ బీబీని నియమిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు షేక్ సయ్యద్‌బాజీ ఓ ప్రకటనలో తెలిపారు. నూతన అధ్యక్షురాలిగా నియమితులైన హుస్సేన్ బీబీని శనివారం పలువురు అభినందించారు. ఈ సందర్భంగా హుస్సేన్ బీబీ మాట్లాడుతూ పదవిని బాధ్యతగా తీసుకుంటానన్నారు. మహిళా సంక్షేమానికి కృషి చేస్తూ వారి సమస్యల పరిష్కానికి కృషి చేస్తానన్నారు. అనంతరం అధ్యక్షుడు సయ్యద్ బాజీకి కృతజ్ఞతలు తెలిపారు.

రేపు వల్లాలమ్మ జాతర

నరసాపురం: పట్టణంలోని టేలర్‌పేటలో ఉన్న వల్లాలమ్మ జాతర ఊరేగింపు సోమవారం రాత్రి 8 గంటలు నుంచి వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఆలయ ధర్మకర్త అద్దంకి రాజు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

సచివాలయాలకు చంద్రగ్రహణం

- కళను కోల్పోయిన సచివాలయాలు
- గతంతో పోలిస్తే 75 శాతం సేవలు కట్
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



పెన్నాడ అగ్రహారం గ్రామ సచివాలయం

పాలకోడేరు: గతంలో గ్రామీణులు ఏ చిన్న పని ఉన్నా వేకువ జామునే లేచి మండల కేంద్రానికో... జిల్లా కేంద్రానికో బయలుదేరేందుకు సిద్ధపడాల్సి వచ్చేది. దీంతో ఉదయం పూట చేసుకునే వ్యవసాయ పనులకు ఇబ్బందులు ఎదురయ్యేవి. పైగా సదరు సమస్యపై రోజుల కొద్దీ కార్యాలయాల చుట్టూ తిరిగినా పనులు అయ్యేవికావు. ఈ విషయాన్ని గ్రహించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ప్రభుత్వ సేవలను గ్రామ స్థాయిలోనే అందించేందుకు సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రతి 2000 కుటుంబాలకు ఓ సచివాలయం ఉండేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు ప్రతి సచివాలయంలో పది మంది శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులు ఉండేలా చర్యలు తీసుకున్నారు. సచివాలయ వ్యవస్థను ద్వారా రైతులు, గ్రామీణుల సమస్యల పరిష్కార కోసం ప్రజలకు 139 రకాల సేవలను అందించే వారు. ప్రతి రోజూ గ్రీవెన్స్ ఏర్పాటు చేసి వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కార మార్గం చూపేవారు. అలానే రైతులు, గ్రామీణుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సచివాలయాలు ద్వారా పొందేవారు. అలానే సంక్షేమ పథకాలు అందించడలోనూ ఈ వ్యవస్థ క్రియాశీలకంగా వ్యవహరించింది.

సచివాలయాలపై చిన్నచూపు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజా సేవలకు పేరొందిన సచివాలయాలు 2024 ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక చిన్నచూపునకు గురయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే సచివాలయాలకు అనుసంధానంగా ఉన్న వలంటీర్ వ్యవస్థను ఉనికిలో లేకుండా చేసింది. అధికారంలోకి వస్తే వలంటీర్లకు రూ.10 వేలు జీతం ఇస్తామని చెప్పి ప్రభుత్వం ఏర్పడ్డాక మాట తప్పారు. ఉండి నియోజకవర్గం లో పాలకోడేరు మండలంలో 18, ఆకివీడు మండలంలో 16, కాళ్ల మండలంలో 21, ఉండి మండలంలో 21 సచివాలయాలు ఉన్నాయి. ఆయా సచివాలయాల్లో దాదాపు 570 మంది పని చేస్తున్నారు. అయితే ఇప్పుడు ఈ ఉద్యోగులను వలంటీర్ల చేయాల్సిన పింఛన్ పంపిణీతో పాటు సర్వేలపై పేరుతో వారిపై పని భారం మోపుతున్నారు. కానీ ప్రజలకు అందించే సేవలను మాత్రం వీరి ద్వారా అందకుండా చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ 2021లో సచివాలయాల ద్వారా 4.08 లక్షల మందికి , 2022లో 4.15 లక్షల మందికి, 2023లో 4.18 లక్షల మందికి, , 2024లో 3.02 లక్షల మంది ప్రజలకు సచివాలయం ద్వారా సేవలందాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక 8 నెలల్లో 30 వేల మందికి కూడా సేవలందించలేకపోయారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. సచివాలయాల ద్వారా అందించే సేవల్లో దాదాపు 75 శాతం సేవలను కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక అందకుండా చేశారు. ముఖ్యంగా ప్రస్తుతం నూతన పింఛన్లకు, రేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకుందామని సచివాలయాలకు వెళితే సర్వర్ పనిచేయడం లేదని చెబుతుండటంతో ప్రజలు వెనుదిరుగుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వ పెద్దలు ప్రజలకు ఉపయోగపడే సచివాలయ సేవలను గతంలో అందినట్లుగానే అందించాలని ప్రజలు కోరుతున్నారు.

సచివాలయాల్లో సేవలు కొనసాగించాలి



సచివాలయాలు లేక ముందు చిన్న సర్టిఫికేట్ కావాలన్న మండలం కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సచివాలయాల్లోనే చాలా వరకు ప్రభుత్వ సేవలను అందుకున్నాం. ప్రస్తుతం ఏ చిన్న పని కావాలన్న మరి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాలని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం సచివాలయాల్లోనే గతంలో అందే సేవలను అందించాలని కోరుతున్నాం.

– కె.అరవింద్, పాలకోడేరు

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి



కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో వలంటీర్లను యథావిధిగా కొనసాగిస్తామని, గౌరవ వేతనం రూ.5 వేలు నుంచి రూ.10 వేలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పారు. ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలు పూర్తయ్యాక వలంటీర్ల వ్యవస్థే లేదని చెబుతున్నారు. మాయ మాటలను కట్టిపెట్టి తక్షణమే వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి.

– డి.ప్రభు విస్సాకోడేరు

జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడిగా కోరా రామ్మూర్తి



కేంద్రమంత్రి చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకుంటున్న రామ్మూర్తి

కాళ్ల: సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ (జెడ్ఆర్‌యూసీసీ) సభ్యుడిగా బీజేపీ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి కోరా రామ్మూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారంకేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ చేతులమీదుగా ఉత్తర్వులను రామ్మూర్తి అందుకున్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు, నాయకుడుకు సముచిత స్థానం లభిస్తుందన్నారు.

సైకిల్ షెడ్ ప్రారంభం

పెనుగొండ: దేవలోని ఎస్ఎంబీటీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించిన సైకిల్‌షెడ్ శనివారం ప్రారంభించారు. 1991–92 విద్యాసంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు నిర్మాణానికి సహకరించారని ప్రధానోపాధ్యాయుడు ఏఎల్ నగేష్ తెలిపారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మామిడిశెట్టి వీవీఎస్ సత్యనారాయణ, జక్కం కేడీవీ ప్రసాద్, బద్దా రమేష్, కంబాల రాంబాబు, నేలపాటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం కోసం కాకుండా విజ్ఞానం కోసం చదవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రేమ్‌సాగర్

ఆకివీడు: బంగారు భవిష్యత్ మీ చేతుల్లోనే ఉంది, ఎదురు చూస్తే ఎండమావేగానే మీ జీవితం మిగులుతుందని ప్రముఖ అడ్వకేట్, సినీ నటుడు, వెబ్ సీరియల్స్ నిర్మాణకర్త ప్రేమ్ సాగర్ చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. పేద కుటుంబంలోజన్మించిన తాను నేడు ఈ స్థితికి రావడానికి కృషి, పట్టుదల ఉన్నాయన్నారు. ప్రతి విద్యార్థీ ఇష్టంతో కష్టపడి చదవాలన్నారు. తాను ఎంచుకున్న మార్గంలో విజయం సాధించడం కోసం నిరంతరం ప్రయత్నాలు చేయాలన్నారు. ఉద్యోగం కోసమే చదవకూడదని, విజ్ఞానం కోసం చదివితే ప్రపంచంలో అనేక ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని ప్రేమ్‌సాగర్ చెప్పారు. అందరూ ఉద్యోగం కోసం ఎదురు చూస్తే కాలం వృద్ధా అవుతుందన్నారు. నేటి ఆధునిక యుగంలో చదవు ఎంతో ముఖ్యమని చెప్పారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ కే.సుజాత మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించి ఉన్నత స్థితికి ఎదిగిన ప్రేమ్‌సాగర్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం ప్రేమ్ సాగర్‌ను ప్రిన్సిపాల్ సుజాత, అధ్యాపకులు సత్కరించారు. కార్యక్రమంలో సరిగమ సంగీత పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.కోటేశ్వరరావు(పాటలకోటి) పాల్గొన్నారు.

నిర్మాణ రంగంలో బీఐఎస్ స్టాండర్డ్స్ పరిగణనలోకి తీసుకోవాలి



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో జాతీయ స్థాయి విద్యార్థి సింపోజియంలో పాల్గొన్న విద్యార్థులు

భీమవరం: కోస్టల్ రీజియన్ ప్రాంతంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టిన బిఐఎస్ స్టాండర్డ్స్ పరిగణలోకి తీసుకోవాలని మహేంద్ర యూనివర్సిటీ సివిల్ ఇంజనీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ కళ్యాణ రామజోష్యుల చెప్పారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న జాతీయ స్థాయి విద్యార్థి సింపోజియం సూపర్ నోవా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కోస్తా రీజియన్‌లో సెలైన్ కంటెంట్ ఎక్కువగా ఉన్నందువల్ల నిర్మాణ సామగ్రితో పాటు భీమ్, కాంక్రీట్ విషయాల్లో బిఐఎస్ స్టాండర్డ్స్ పరిశీలించాలన్నారు. సివిల్ ఇంజనీరింగ్ సీనియర్ ప్రొఫెసర్ ఎం జగపతిరాజు మాట్లాడుతూ సివిల్ ఇంజనీరింగ్‌లో ప్రధాన భూమిక పోషించే యంత్రాలు క్రేయిన్స్, బుల్‌రోజర్స్‌లో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయని ప్రస్తుత పరిస్థితులకు తగిన విధంగా టెక్నాలజీ డెవలప్‌మెంట్‌తో యంత్రాలు వస్తున్న మార్పులు గమనించాలన్నారు. ఫ్యాకల్టీ అడ్వైజర్ పీవీ రాంబాబు మాట్లాడుతూ నిర్మాణ రంగంలో వస్తున్న మార్పులను విద్యార్థులు అధ్యయనం చేసేందుకు సూపర్ నోవా లాంటి సింపోజిం ఎంతగానో దోహదపడతాయన్నారు. సివిల్ ఇంజనీరింగ్ హెడ్ జి శ్రీబాల అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ఆర్అండ్‌డి డీన్ టి వంశీనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పీడీఎఫ్‌కు మద్దతు ఇవ్వాలి



కరుగోరుమిల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న డీవైఎఫ్ఐ సభ్యులు

పెనుగొండ: యువజనులు, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఉభయ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా పీడీఎఫ్ బలపరిచిన దిడ్ల వీర రాఘవులకు మద్దతు నివ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీఎస్ శర్మ విజ్ఞప్తి చేశారు. శనివారం ఆచంట మండలంలో దిడ్లకు మద్దతుగా కరుగోరుమిల్లిలో విస్తృత ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ, టీచర్ పోస్టుల భర్తీ, నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని విమర్శించారు. ఓట్లు దండుకున్న కూటమి ప్రభుత్వం ఎనిమిది నెలలు దాటుతున్నా వాగ్దానాలు అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. సమస్యల పరిష్కారానికి పోరాటం చేసే పీడీఎఫ్‌కు మద్దతుగా నిలవాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పి.చంటిబాబు, టి.దుర్గా ప్రసాద్, మోహన్, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



భీమవరం: ఎస్పీ క్యాంపు కార్యాలయం వద్ద పరిసరాలను శుభ్రం చేయిస్తున్న ఎస్పీ



భీమవరం: ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



ఉండి: రైల్వే స్టేషన్ వద్ద స్వచ్ఛ దివస్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం భీమవరం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం, ఎస్పీ క్యాంపు కార్యాలయాల వద్ద పోలీసు అధికారులు పిచ్చి మొక్కలను తొలగించారు. ఈసందర్భంగా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పరిశుభ్ర రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మూడవ శనివారం కార్యాలయ ఆవరణలో పరిశుభ్రతను నెలకొల్పే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా చాలావరకు అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చునన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ప్రతినెల మూడవ శనివారం స్టేషన్ అధికారులు, సిబ్బంది సంబంధిత స్టేషన్లలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ (అడ్మిన్)వి భీమారావు, జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ. ఎంవీవీ సత్యనారాయణ, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి పుల్లారావు, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కె వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఉండిలో..

ఉండి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం మనందరి కనీస బాధ్యత అని ఐటీఐ జిల్లా కన్వీనర్ వీ శ్రీనివాస రాజు,ఉండి ఎస్సై ఎండీ నసీరుల్లా అన్నారు. శనివారం ఉండి రైల్వే స్టేషన్ వద్ద ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులు, అధ్యాపకులు, పోలీసులు,రైల్వే సిబ్బంది సంయుక్తంగా స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్, పరిసర ప్రాంతాల్లో పరిసరాలను పరిశుభ్రం చేశబూరు. సందర్భంగా శ్రీనివాసరాజు,ఎస్సై నసీరుల్లా మాట్లాడుతూ మన పరిసరాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకోకపోతే దాని ఫలితం మనమే అనుభవించాల్సి వస్తుందని అన్నారు. ప్రతి మూడో శనివారం ప్రభుత్వ కార్యాలయాలు లేదా ఏదైనా గ్రామంలోని ఓ ప్రాంతంలో స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహిస్తారని తెలిపారు.

ప్రణాళిక బద్ధంగా వ్యర్థాల నిర్వహణ అవసరం

భీమవరం: వ్యర్థాల నిర్వహణ పట్ల ప్రతిఒక్కరికీ సరైన ప్రణాళిక అవసరమని భీమవరం ఎక్సైజ్ సీఐ కె బలరామరాజు అన్నారు. భీమవరం ఆర్‌ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, స్వచ్ఛతా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజలందరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ వికెజె ప్రసూన మాట్లాడుతూ చెత్తను సంచరించే పరిసరాల్లో వేయడం వల్ల వైరస్ కారకవ్యాధులు ప్రబలుతాయన్నారు. చెత్త వల్ల ఏర్పడే అనార్థాలను ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కాకుమాని శ్రీనివాసరావు, పి రాజశేఖర్, సీహెచ్ సత్యనారాయణ, జి ఉమామహేశ్వరి, ఎల్ నర్సింహారావు, పి అమూల్యరావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో మనుగడే ప్రశ్నార్థకం



ఆకివీడు: మాట్లాడుతున్న పంచాయతీ జిల్లా రిసోర్స్‌పర్సన్ కేఎస్ఎస్ రామలక్ష్మి

ఆకివీడు: ప్లాస్టిక్ వ్యర్థాలతో మనుగడే ప్రశ్నార్థకంగా మారిందని పంచాయతీ జిల్లా రిసోర్స్‌పర్సన్ కేఎస్ఎస్ రామలక్ష్మి చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ మనం ఉపయోగించే వ్యర్థాలను మూడు రకాలుగా విభజించారన్నారు. తడి, పొడి చెత్తలతో పాటు, గృహోపకర వ్యర్థాల్ని వేరు వేరుగా ఉంచి పారవేయాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కే.సుజాత మాట్లాడుతూ వ్యర్థాలను తగ్గించాలన్నారు. అలాగే స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ గణేష్, ఆధ్వర్యంలో ఆస్పత్రి ఆవరణలో చెత్త శుభ్రం చేయించారు.

రాజీ మార్గమే రాజమార్గం



సబ్‌జైలులో రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న రత్నప్రసాద్

నరసాపురం: రాజీ మార్గమే రాచమార్గమని నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు అన్నారు. మార్చి 8న నిర్వహించనున్న లోక్ అదాలత్ కోసం శనివారం కోర్టులో బార్ అసోసియేషన్ ప్రతినిధులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయని చెప్పారు. న్యాయవాదులు కక్షిదారులకు అవగాహన కల్పించి రాజీ చేసుకునేలా ప్రోత్సహించాలని కోరారు. గతంలో కంటే ఎక్కువ కేసులు పరిష్కారం లచ్చేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చేగొండి బాలాజీ, కార్యదర్శి రంపా పుల్లాజీ , ట్రెజరర్ పూర్ణిశ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలు తనిఖీ

నరసాపురం: రిమాండ్‌లో ఉండి ఆర్థిక స్థోమత లేని కారణంగా బెయిల్ కోసం న్యాయవాదిని నియమించుకోలేనివారు మండల న్యాయసేవాధికార సంస్థను సంప్రదిస్తే ఉచిత న్యాయ సహాయం అందిస్తామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి టి.రత్నప్రసాద్ చెప్పారు. శనివారం ఆయన నరసాపురం సబ్‌జైలును తనిఖీ చేశారు. రిమాండ్ ఖైదీల కేసుల వివరాలు తెలుసుకున్నారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారం, ఇతర సదు పాయాలులపై ఆరా తీశారు. జైలు ప్రాంగణంలో ఉన్న ఉచిత న్యాయ సహాయ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నరసాపురం జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్, జైలు సూపరింటెండెంట్ టి.అప్పారావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ



ఉండి: మాట్లాడుతున్న సీడీపీఓ వాణీ విజయరత్నం



పాలకోడేరు: జెడ్పీ హైస్కూల్‌లో అంగన్‌వాడీలకు శిక్షణనిస్తున్న దృశ్యం



వీరవాసరం: శిక్షణలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఉండి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పోషకారంతో కూడిన విద్యను అందించాలని ఆకివీడు ప్రాజెక్టు సీడీపీఓ వాణీ విజయరత్నం అన్నారు.శనివారం మండలంలోని యండగండిలో విస్సాకోడేరు, పాలకోడేరు, యండగండి, ఉండి సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లకు పోషణ్ భీ- పడాయ్ భీ కార్యక్రమాలపై శిక్షణ తరగతులు యండగండి ఎంపీపీ స్కూల్‌లో నిర్వహించారు.ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ పోషణతో కూడిన విద్యను అందించేందుకు ప్రభుత్వం అందించిన ప్రణాళిక ప్రకారంగా అందరూ పనిచేయాలని అన్నారు.ముఖ్యంగా ప్రీస్కూల్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నాణ్యమైన బాల్యాభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషణ్ భీ-పడాయ్ భీ శిక్షణ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సీడీపీఓ వాణి విజయరత్నం శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండో రోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా తల్లి జీవితచక్రంలోని దశల గురించి, లోప పోషణకు కారణాలు, సూక్ష్మ పోషక లోపాలనివారణ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జి.పార్వతి, కె.సూర్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

వీరవాసరం: అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ- పడాయి భీ కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్లు పి .బేబీ వెంకట లక్ష్మి సరోజినీ, డి .గీత మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే అందరికీ పౌష్టికాహారం అందజేయాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, ఇతరత్రా ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణమ, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
భీమవరం డివిజన్
90102 23729
90108 51166
Office mail : tpgadvt@gmail.com